# మరనాత మెసేంజర్

క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక

# MARANATHA MESSENGER




సంపుటి 37 ఏప్రిల్ 2019 సంచిక 4



మరనాత
బిబ్లికల్ సెమినరీ
విజయవాడ
Accredited by
Asia Theological Association &
Christ For The Nations Association of Bible Schools
కోర్సులు కాలపరిమితి బోధనాభాష
B.Th 3 సంవత్సరాలు ఇంగ్లీష్ & తెలుగు
Dip.Th 2 సంవత్సరాలు తెలుగు
C.Th ఒక సంవత్సరం తెలుగు
జూన్ 24 నుండి క్లాసులు ప్రారంభం
అభిషిక్తులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.
డైరెక్టర్
శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
సమ్మర్ కోర్స్
2019
ఏప్రిల్ 8 - మే 17 వరకు
కంప్యూటర్, సంగీతము, ప్రత్యేకమైన లైబ్రరి తరగతులు.
విశిష్టతలు
Spoken English Courses
ATA Curriculum
ఆసక్తిగలవారు అప్లికేషన్ నిమిత్తం రూ.200/- పంపి పొందగలరు.
విద్యార్థినీ విద్యార్థులకు, వివాహితులకు ప్రత్యేక వసతి.
మరనాత విశ్వాస సమాజము
గాయత్రీనగర్, విజయవాడ.
E-mail : mvpvja8@gmail.com
9642793777
9441308156, 7799212199

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 11-03-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month



శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

# మరనాత వేద పాఠశాల – విశాఖ

## మరనాత విశ్వాస సమాజపు పరిచర్య

'దైవసేవ - దేశసేవా తత్పరులైన యువతకు అద్భుత అవకాశం'




జన్మ, కర్మ, పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగువారికి చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! లేవాలి!! అందుచేతనే స్వయాన ప్రభువు వారే "కోత విస్తారమేగాని పని వారు కొద్దిగా ఉన్నారు" అని వాపోయారు.

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 33 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.



## నిర్వహించే కోర్సులు :

1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సం॥లు (4 సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సం॥లు (6 సెమిస్టర్లు)
3) 40 రోజుల వేసవి వేదపాఠశాల (ఏప్రిల్ 9- మే నెల 19 వరకు)

అర్హతలు : రక్షణానుభవము, సేవార్థమైన దేవుని పిలుపు, సమర్పణ, 18 సం॥లు పైన వయస్సు గలవారు.

**స్త్రీలకు ప్రత్యేక వసతి**

వాక్యతర్ఫీదు పొందవాలన్న ఆసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ. 100/-లు పంపి, పొంది, పూర్తి చేసి వెంటనే పంపించవలెను. భోజనము, వసతి : ఉచితం; బోధనా భాష : తెలుగు.




**ప్రత్యేకతలు :**

- ఉన్నత విద్యార్హతలు
- వాక్య పరిజ్ఞానము
- స్వదేశీ, విదేశీ సేవానుభవం కల్గిన అధ్యాపక బృందం మరియు
- వ్యక్తిగత శ్రద్ధ
- క్రమశిక్షణ
- సిద్ధాంత, ఆచరణాత్మక పద్ధతుల సమన్వయము.


**వివరములకు :**

రెవ. శిలువురపు సైలస్ ప్రకాష్
M.Com., M.Div. (USA)
డైరెక్టర్, మరనాత వేద పాఠశాల
50-43-9, పి అండ్ టి కోలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం-530013.
✆ : 98481 24651,
9949590555, 8897884111
maranathavisakha@gmail.com




# ఈ సంచికలో


1. లూకా సువార్త - 34 - శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి
2. ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక -19 - డా॥ నిరీక్షణ కె. కంచర్ల
3. ప్రమాదపు అంచుల్లో - సహోదరి ఎ. ఉషారాణి
4. ఎఫెసీ పత్రిక - 8 - రెవ. అల్లూరి విశ్వప్రసాద్
5. ఫిలిప్పీ పత్రిక - శ్రీమతి దేవినేని నిర్మల
6. జ్ఞానధార - డా॥ మనష్షే కొటారి
7. మతం-కాదెన్నటికి ముక్తిమార్గం - ఝాన్సి ఇమ్మానుయేలు
7. వార్తల్లో కొన్ని - సంపాదకులు



ప్రధాన సంపాదకులు : శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

సంపాదక వర్గం :

రెవ. ఫిలిప్ ప్రకాష్, రెవ.డా॥ నిరీక్షణ కంచర్ల, రెవ. జి.యం.రాజు, రెవ.జి.యేసుదాసు


మీ చందాలు, వ్యాసములు ఈ క్రింది చిరునామాకు పంపించండి


**మరనాత మెసేంజర్, గాయత్రి నగర్, విజయవాడ - 520 008.**

**Phone : 0866 - 2480047 e-mail : mvs828@gmail.com**


**: Bank Details :**

**THE SOUTH INDIAN BANK LTD.**

**A/c. No. 0142073000000861 IFSC : SIBL0000414**

ప్రకటన వివరాలు

పూర్తి పేజి : రూ. 1,500/- అరపేజి : రూ. 800/-

టైటిల్ పేజి 3 లేక 4 : పూర్తి పేజి రూ. 3,000/- అరపేజి రూ.1,500/-

| | స్వదేశములో | విదేశములో |
|---|---|---|
| సాలుసరి చందా | రూ. 150/- | రూ. 1,000/- |
| విశేష సభ్యత్వం | రూ. 1,000/- | రూ. 3,000/- |
| జీవిత సభ్యత్వం | రూ. 5,000/- | రూ. 15,000/- |


This Magazine is Printed, Published and Owned by G. Moses Choudary & Printed at Alpha & Omega Publications & Printing Works, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008. This Magazine is Edited by G. Moses Choudary, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008.

# లూకా సువార్త
## (34 వ భాగము)

**శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ**

## గమనించదగిన సూత్రాలు : (లూకా సువార్త 8 : 16-18)

పాఠకమిత్రులకు ప్రభువైన యేసుక్రీస్తునామములో శుభములు, ఆశీస్సులు కలుగునుగాక!

దేవునియొక్క దయాళుత్వము, మంచితనము, దీర్ఘశాంతము, విశ్వాస్యతలను అద్భుతముగా అనుభవించడములో ఎంతో తృప్తి ఉంది. జీవితబాటలో సమస్యలు ఎదురైనప్పటికి జీవితాన్ని ప్రశాంతంగా జీవించవచ్చు. సమస్యయొక్క ఉనికి ఎప్పుడూ రెండుచోట్ల ఉంటుంది.

**1. మన వెలుపల :** మన వెలుపల వచ్చిన సమస్యను లోపలికి తెచ్చుకొంటే అది లోపలికి వచ్చి మనలను నెమ్మదిగా తొక్కడం మొదలుపెడుతుంది.

**2. మన పైన :** సమస్య మన పైనఉంటే ఆ ఒత్తిడికి సమస్యల క్రింద మనం సతమతమవుతూ ఉంటాము. సమస్యలను మన అదుపులోఉంచి, వాటిని త్రొక్కిపెట్టగలిగినట్లయితే, ఆ సమస్యలకు అతీతమైన స్థాయిలోనికివెళ్లి ప్రశాంతతను, సమాధానాన్ని నెమ్మదిని మనం అనుభవించాలంటే ఈ మహాప్రభువు యేసు దేవుని సన్నిధిలో మీసమస్యకొరకు ఆక్రందన చెయ్యాలి. దేవుని దగ్గరే జవాబుందని మనవి చేస్తున్నాను. మీరును ప్రయత్నించెయ్యండి.

ఈ సంచికలో లూకా సువార్త 8 : 16-18 వచనాలు ధ్యానం చేద్దాం. యేసు బోధిస్తూ- **"ఎవడును దీపం ముట్టించి పాత్రతో కప్పివేయడు, మంచము క్రింద పెట్టడు కాని లోపలికి వచ్చువారికి వెలుగు అగపడవలెనని దీపస్థంభముమీద దానిని పెట్టును. తేటపరచబడని రహస్యమేదియు లేదు. తెలియజేయబడకయు బయలుపడకయు నుండు మరుగైనదేదియు లేదు. కలిగినవానికి ఇయ్యబడును. లేనివానియొద్దనుండి తనకు కలదని అనుకొనునది కూడ తీసివేయబడును గనుక మీరేలాగు వినుచున్నారో చూచుకొనుడని చెప్పెను".** ఇక్కడ గమనించదగిన మూడు సూత్రాలు ప్రభువు మనకు చూపిస్తున్నాడు.

**గమనించదగిన మొదటి జీవన సూత్రం - "ఎవడును దీపం ముట్టించి పాత్రతో కప్పివేయడు, మంచము క్రింద పెట్టడు కాని లోపలికి వచ్చువారికి వెలుగు అగపడవలెనని దీపస్థంభముమీద దానిని పెట్టును".** వెలిగించిన దీపాన్ని మంచం క్రింద, కుంచము క్రింద పెట్టము కదా! ఎందుకంటే దీపముయొక్క ఉద్దేశ్యము వెలుగు నివ్వాలి, ఆ వెలుగు మన ఇంటిలోని చీకటిని పారద్రోలి, లోనికివచ్చువారికి వెలుగిస్తూ అందరికి ఉపకరించేదిగా ఉండాలి. యేసు బోధను విని, నమ్ముకొని, ప్రభువును సేవించే వారి హృదయాలలో వెలుగు ఉదయించాలి అంటే చీకటివంటి పాపము పారద్రోలబడాలి.

పాపము పోయినప్పుడే నీతి వెలుగు హృదయములోనికి వస్తుంది. అలా వచ్చినప్పుడు వాళ్ల ప్రవర్తనలో పరివర్తన, శుద్ధి కలగాలి. అట్టి పరివర్తన అనేది ఒకనాటికి లేదా ఒక సందర్భానికి పరిమితం కాదు. మనం దేవుని వాక్యమును ధ్యానిస్తూ, వింటూఉండగా పరిశుద్ధాత్మ దేవుని వాక్‌శక్తి, ఆత్మశక్తి రెండూ మనలో క్రియచేస్తూ ఉండగా ఆ పరిణతి మనలో రోజూ కలుగుతూ ఉండాలి. మన భావాలలో, అలవాట్లలో, మాటల్లో, చూపుల్లో, క్రియల్లో మార్పురావాలి. మనం ప్రత్యేకంగా కనపడాలి. సువార్తద్వారా ప్రభావితులై మార్పు పొందినవారు ఆత్మలో వెలిగించబడినట్లు లెక్క. అట్టివారు వెలిగే దీపం వలె చుట్టూఉన్న వారికి వెలుగునివ్వాలి. మనచుట్టూ పాపపు చీకటిలో బంధితవై, దుర్వ్యసనాలకు బానిసలై అస్తవ్యస్తమైన బ్రతుకుల్లో ఉన్నవారున్నారు. అట్టివాళ్లు మనలను చూచినప్పుడు, మనలో వచ్చిన పరివర్తన (మారిన మన ప్రవర్తన) యొక్క ప్రభావాన్ని వారు కూడా అనుభూతిచెందాలి. తద్వారా వారిలోకూడ ఈ ప్రభావము కనబడాలి.

అప్పుడప్పుడు నాకు బాగాకావలసిన మిత్రులు, ఉన్నత విద్యావంతులతో కలసి కూర్చున్నప్పుడు వచ్చే సంభాషణలో - భ్రష్టుపట్టిన మన లంచగొండి వ్యవస్థను, అవినీతిని గూర్చి చర్చిస్తూ గబుక్కున ఎవరినోగూర్చి రెండు బూతుమాటలు వదిలేస్తారు. వెంటనే సారీ అండీ చౌదరిగారు అని నాలుక కొరుక్కుంటారు. అంటే, బూతుభాష మాట్లాడకూడని వయసు, విద్యార్హతలు మరియు ఇలాంటి పెద్దలముందు మాట్లాడుతున్నాను అనే గిల్టి ఫీలింగ్ (అపరాధ భావన) వాళ్లల్లోకి వచ్చేస్తోంది. ఎందుకంటే - నాలోఉన్న ప్రభువైన యేసు యొక్క వెలుగు వాళ్లలోఉన్న చీకటిని బహిర్గతం చేసి చూపిస్తుందన్నమాట. అదేవిధంగా మీలో ఉన్న వెలుగు పరులలో ఉన్న చీకటిని చూపించేదిగాను, పారద్రోలేది గాను ఉండాలి. చూపించడం మన వంతయితే పారద్రోలడం అనేది వారు స్వీకరించే విధంలో ఉంది. ఎలాగంటే - మనలో చూచిన ఆ మంచిమార్పుకు ప్రభావితులైనవారు మాలోకూడ అట్టిమార్పు రావాలి అనే కాంక్ష కలిగి వారు నిర్ణయం చేసుకొని, ప్రభువును నమ్ముకోవడం, పశ్చాత్తాపంతో దేవుని సన్నిధిలో ప్రార్థించడం ద్వారా వాళ్లలోకూడ మార్పు వస్తుంది. అలా మార్పు పొందినవారిని ఎంతోమందిని చూస్తున్నాను. పరులకు వెలుగు నివ్వని దీపాలెందుకు చెప్పండి? శుద్ధదండగ కదా! కొడిగట్టిన దీపాలువంటి నిష్ప్రయోజన కరమైన విశ్వాసులు క్రైస్తవసంఘాలలో ఉన్నారు. వారి మాటలు చూస్తే కోటలు దాటు తాయి గాని, వాళ్ల బ్రతుకులో, ప్రవర్తనలో వెలుగుఉన్నట్లుగా ఏమీ ఆధారం కనపడదు.

సోదర, సోదరీల్లారా! మీలోఉన్న నైతిక, ఆధ్యాత్మిక వెలుగు, పరిణతి చెందని ధోరణి కొడిగట్టిన స్థితిలో ఉన్నట్లయితే ఆ కొడిగట్టిన భాగాన్ని నలిపేసి మళ్లీ వత్తిని దేదీప్యమానంగా వెలిగించుకోవాలని మనవిచేస్తున్నాను. చీకటిని పూర్ణంగా పారద్రోలలేని మిణుగురు పురుగువంటి స్థాయిలో మీ నీతి ఉన్నట్లయితే అది ఎవరికి, చివరకు మీకు కూడ అక్కరకు రానిదని మనవిచేస్తున్నాను.

మనిషిలో ఉండవలసిన ఆధ్యాత్మిక, నైతిక వెలుగుకు మూలం నిజవెలుగైన, **'నేను లోకమునకు వెలుగైయున్నాను'** అని సెలవిచ్చిన యేసుక్రీస్తు ప్రభువు దగ్గరకు వచ్చి మీ

జీవితాలను వెలిగించుకోవాలని నేనెంతో ఆకాంక్షిస్తూఉన్నాను. అది మొదటి గమనించ వలసిన జీవనసూత్రం.

**గమనించదగిన రెండవ జీవన సూత్రం - "తేటపరచబడని రహస్యమేదియు లేదు. తెలియజేయబడకయు బయలుపడకయు నుండు మరుగైనదేదియు లేదు"** అన్నాడు ప్రభువు. ఏదోఒక రోజున అన్నీ బట్టబయలవుతాయి. మనిషి మూడురకాల వ్యక్తులకు తన రహస్యాలను మరుగుచేయడానికి ప్రయత్నం చేస్తాడు.

**1. తనకు తానే మరుగుచేసుకొంటాడు :-** మొదట మనలో ఉన్న వ్యసనాలు, దోషాలు, తప్పిదాలు, అలవాట్లు రహస్యాలను వాటి పర్యవసానాన్ని తెలియనట్లుగా మనమే మరుగు చేసుకొంటాం. ఎందుకంటే వాటి దుష్ఫలితాన్నిగూర్చి ఆలోచిస్తే ఈ అలవాట్లు మానుకోవలసి వస్తుందని ఆభాగాన్ని మరుగుచేసి ఉంచుకోవడానికి ప్రయత్నం చేస్తాం. అది మనిషి నైజంలో ఉన్న భాగం. మీ దురలవాట్లు, దుర్బుద్ధులు, వ్యసనాలు వాటి దుష్పరిణామాలను మీరు పట్టించుకుంటే అలవాటుపడిన మీ చెడువ్యసనాలను మానుకోవలసి వస్తుంది కాబట్టి ఇది మానలేననే భయంచేత దాన్ని మరుగుచేసుకోవడానికి ప్రయత్నం చేస్తారు. ఇలాంటివారు కూర్చున్న కొమ్మనే నరుక్కునే అవివేకిని పోలిఉన్నారని చెప్పక తప్పదు.

**2. కుటుంబానికి మరుగుచేస్తాడు :-** సహజంగా మనలో ఉన్న దోషాన్ని, రహస్యమైన పాపపు జీవనశైలిని మన కుటుంబీకులుకి మరుగుచేసి ఉంచడానికి శతవిధాల ప్రయత్నం చేస్తాం. మీకుటుంబానికి తెలియనంతమాత్రాన మీ రహస్య పాపజీవితం దాచుకోగలనను కొంటున్నారా? మీలో ఉన్న దేవుడు పెట్టిన దీపం వంటి మీ మనస్సాక్షి మీమీద నేరారోపణ చేయటములేదా. నీవు మంచిచేస్తే మంచిపని చేశావని మెచ్చుకొంటూ, చెడుచేస్తే ఇంత చెడ్డపని ఎందుకు చేశావని ఎవరో లోపలినుంచి గద్దించినట్లుగా, హెచ్చరిస్తున్నట్లుగా అనిపిస్తుంది గదా! దేవుడు దీపంలా పెట్టిన మనస్సాక్షే దీనికి హేతువు. అన్యాయానికి పాల్పడుతూ అనుకున్నది సాధిస్తున్నామనే తృప్తి మీకు ఉండవచ్చుగాని, అది తప్పని మీ మనస్సాక్షి మీమీద ఆరోపణ చేయడంలేదా? ఆ మనస్సాక్షి కూడ ఆరోపణలు చేసి, చేసి కొంత కాలానికి వాతవేయబడి పోతుందట. అంటే చురకవేస్తే చర్మం గట్టిపడిపోయినట్లు స్పర్శను కోల్పోయిన మనస్సాక్షిని దేవుడు బైబిల్‌గ్రంథంలో **'వాతవేయబడిన మనసాక్షి'** అన్నాడు .

**3. దేవునికి మరుగుచేస్తాడు :-** చాలామంది తమ రహస్యపాపాలను, రహస్యజీవితాన్ని దేవునికి మరుగుచేసి దాచుకోగలమనుకొంటారు. దేవునికి కనబడకుండా పాపాన్ని దాచుకో వడం అసాధ్యమని తెలియనటువంటి వారిని అవివేకులు, మూర్ఖులని చెప్పాలి. అట్టివారు ప్రపంచంలో కోకొల్లలుగా ఉన్నారంటే ఆశ్చర్యంలేదు. దేవుడు చూడలేనివాడైనట్లుగా భావించి అన్యాయానికి, అక్రమానికి, అవినీతికి అనేకులు పాల్పడుతున్నారు. గాని, అట్టివారు దేవుని కనుదృష్టిని తప్పించుకోలేరు. మన మనసులో చేసిన ఆలోచనలను ఆయన క్షుణ్ణంగా ఎరిగినవాడు. దేవుని కనుదోయిని కప్పుట ఎవరికీ సాధ్యంకాదు. కారణం, కంటిని నిర్మించినవాడు కానకుండునా? అని దేవునివాక్యము సెలవిస్తుంది. మనుష్యుని పాపపు

ఆలోచనలు, మాటలు, క్రియలయొక్క దుష్పరిణామం శిక్ష రూపంలో దేవుని సన్నిధి నుండి వచ్చినరోజున అడ్డుపడేవారు ఎవరూ ఉండరు. జాగ్రత్త సుమా!

**గమనించదగిన మూడవ జీవన సూత్రం- "కలిగిన వానికి ఇయ్యబడును. లేనివానియొద్దనుండి తనకు కలదని అనుకొనునది కూడ తీసివేయబడును".** ప్రతి మనిషి తన జీవితములో ముందు, వెనుకలకు కదలక తప్పదు. ఉన్నచోటనే ఉండటం సాధ్యంకాదు కదా. 'నీరు పల్లమెరుగు, నిజం దేవుడెరుగు' అన్నారు. నీరు పల్లానికి గాకుండా ఎత్తుకు వెళ్లడం సాధ్యపడదు. ప్రవాహంగా వెళుతున్నప్పుడు నీరు స్వచ్ఛంగా ఉండటానికి ఆస్కారం ఉంది. ఒకేచోట నిల్వఉన్న నీరు చెడిపోయే ప్రమాదంఉంది. ప్రవాహపు నీటిలో ఉన్న స్వచ్ఛత నిలబడే నీళ్లలో ఉండదు.

జీవితంకూడ అంతే! నేర్చుకొనే విధానము మనందరిలోను ఉంది. నేర్చుకోవాలనే జిజ్ఞాస కలిగిన మనిషి నేర్చుకొనే అవకాశం ఉన్నప్పుడు ఎంత నేర్చుకొంటే అంత పరిణతి చెందుతాడు, నేర్చుకోవడం ద్వారా జ్ఞానాన్ని ఇంకాఇంకా వృద్ధి చేసుకొనే అవకాశం ఉంది. నేను నేర్చుకోను, నాకెవరూ చెప్పొద్దు, నాకన్నీతెలుసని అనుకొనేవాడు ఆగిపోతాడు, అసమర్థుడుగా ఉండిపోతాడు. తనకు తెలిసినదానితో పరిమితమైపోతున్నాడు. అందుచేత కలిగినవానికి ఇయ్యబడును అంటే, మనలో ఎన్నో తలాంతులున్నాయి. వాటిని వృద్ధిచేసుకోవడానికి కృషిచేస్తే అవి ఎంతయినా వృద్ధిఅవుతాయి. ఉదాహరణకు : వ్యాయామం చేసేవారి కండరాలు బలాభివృద్ధి చెందునట్లుగ వ్యాయామం చెయ్యనివారు శక్తిని పొందలేరుకదా. అందుకే ప్రభువు అందరూ గమనించవలసిన జీవనసూత్రాన్ని గూర్చి- కలిగినవానికి ఇంకా ఇవ్వబడుతుంది. లేని వాడు ఉంది.., ఉంది అని భ్రమపడుతున్నది కూడ వానియొద్దనుండి తీసివేయబడుతుంది అన్నాడు.

మనలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి దాన్ని ఎంతగా పెంపారచేసుకుంటామో అంత సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవచ్చు. సామర్థ్యాన్ని వృద్ధిచేసుకోవడానికి చేయవలసిన కృషి చేయకుండా ఉంటే వాడి సామర్థ్యము చివరికి అసమర్థత రూపం దాలుస్తుంది. అందుకే ప్రభువు - 'అడిగినవాడు పొందుకుంటాడు, తట్టినవానికి తియ్యబడుతుంది, వెదకినవానికి దొరుకుతుంది' అన్నాడు. అంటే వెదుకుతున్న కొద్దీ సత్యాన్ని, జ్ఞానాన్ని, సామర్థ్యాన్ని ఎన్నో రీతులుగా మనం వృద్ధి చేసుకోవచ్చు. అడిగిన వానికి మరెంతో పెంచుకొనే అవకాశముంది కాబట్టి అట్టివానికి ఇవ్వబడుతుంది అన్నాడు.

అవకాశాలు అందిపుచ్చుకొంటే మరెన్నో దేవుడు ప్రసాదిస్తాడు. వాటిని సద్వినియోగం చేసుకోవడం చేతగాక పోగొట్టుకొని బాధపడితే ప్రయోజనం ఏముంది చెప్పండి? మీలో ఉన్న వెలుగును దాచిపెట్టుకోకండి, మీలోఉన్న సామర్థ్యాన్ని పెంచుకోండి, మీలో ఉన్నటువంటి అద్భుతమైన ఆశీర్వాదముల సిరులు పరులతో పంచుకోవడంద్వారా వాటిని మీనుంచి ఇంకొకరికి, వారినుంచి వేరొకరికి ప్రవాహంగా పోనివ్వండి. దేవుడు మిమ్ములను ఆత్మసంబంధమైన, నైతిక ధనవంతులుగా తీర్చిదిద్దును గాక.

**- మరనాత.**

# అభ్యర్ధన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., Ph.D.
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరీ
హైదరాబాదు. సెల్ : 9849746464

## షూనేమీయురాలి కుటుంబ సంరక్షణ

పాఠక మిత్రులకు వందనములు.

దేవుని కొరకు త్యాగసహితమైన విశ్వాసముతో స్పందించి, తత్సంబంధిత కార్యములు జరిగించిన వారికి దేవుడెప్పుడూ తోడుగా ఉండి సంరక్షిస్తాడు. అందరికి దైవానుగ్రహం లభించినా, విశ్వాస విధేయతలతో దేవునిపట్ల స్పందించిన వారికి ప్రత్యేకంగా దొరుకు తుందని చెప్పుకోవచ్చు. దేవుని కొరకు ఏమీ చెయ్యకుండా, అన్నీ జరగాలనుకోవటం చాలామంది ధోరణి. దేవుని అనంత ప్రేమ అందరిని స్పృశించి ఆదుకుంటుంది. అయితే త్యాగసహిత విశ్వాసులను ప్రత్యేకంగా ఆవరిస్తుంది. అలాంటి సంఘటనను పరిశీలిద్దాం.

2 రాజులు 8 : 1-6 - ఈ భాగములో ప్రవక్తయైన ఎలీషా షూనేమీయురాలిని పిలిచి ఇశ్రాయేలు దేశములో కరువు సంభవింపబోతోంది, గనుక మీకిష్టమైన ప్రాంతమునకు వెళ్ళి మీ ప్రాణములు సంరక్షించుకొనుమని హెచ్చరించాడు. దైవజనుడైన ఎలీషా ద్వారా ఆమెకు ప్రత్యేక సమాచారమందింది. కారణం, ఆమె మరియు కుటుంబం దేవుని త్యాగ సహిత విశ్వాసంతో సేవించినవారు. 2 రాజులు 4 : 8-10 వచనాలను పరిశీలిస్తే, ఈ షూనేమీయురాలు ఘనమైన విశ్వాసంతో దైవజనుడైన ఎలీషా నిఖార్సైన దైవప్రతినిధియని గుర్తించి, భర్తను ఒప్పించి అతనికొక ప్రత్యేక గదిని కట్టించినది. ఎలీషా ఆదారిలో ప్రయాణించి నప్పుడెల్లా అందులో బసచేసేవాడు. ఇది నిజంగా ఆశ్చర్యం. సొమ్ములు చాలామందికుంటాయి గాని వాటిని సద్వినియోగం చేసుకొనేవారు చాలా తక్కువమందుంటారు. వారికొరకు, కుటుంబ సభ్యుల కొరకు మాత్రమే వినియోగించుకొని యోగ్యమైన సేవకులను, సేవలను పట్టించుకోవలసినంతగా పట్టించుకోరు. సొమ్ములు వారివేగాని భాగ్యము సంపాదించుకొనుటకై సామర్థ్యము కలుగజేసినవాడు దేవుడే గదా! (ద్వితి 8 : 18). అంతేగాని వారి బాహుబలము వలన మాత్రమే సంపద పెరగలేదు, వారి ప్రయాసకు తోడు వాతావరణం, చుట్టూ ఉన్న మనుష్యులు కలిసొచ్చినందున, అన్నింటికి పైగా దైవానుగ్రహం వారిపట్ల ఉన్నందున భాగ్యవంతు లయ్యారు. కనుక సదా కృతజ్ఞతతో సంపదను కుటుంబ అవసరాలకు మరియు వసుదైక కుటుంబమని పిలువబడుతున్న యేసుక్రీస్తు సంఘ అవసరాలకు వినియోగించాలి. ఇది దైవిక కట్టడ. "యెహోవా ఆశీర్వాదము ఐశ్వర్యము నిచ్చును. నరుల కష్టముచేత ఆ ఆశీర్వాదము

ఎక్కువగాదు" (సామెతలు 10 : 22). అంటే ఐశ్వర్యము దేవునిది. అది కేవలము నరుల కష్టార్జితము కాదు. కష్టానికి దైవానుగ్రహం తోడైతేనే అది అధికమౌతుంది.

ఆసంగతిని గ్రహించిన షూనేము పట్టణానికి చెందిన ఘనవిశ్వాసము గల స్త్రీ భక్తి గల దైవజనునికి మేడపైన ప్రత్యేక గదిని ఏర్పాటుచేసింది. తద్వారా తనకు మేలు జరుగుతుందని కాదుగాని, భక్తిగల దైవజనులకు తన సంపాదనను వినియోగించటం నిజ భక్తిలో భాగమనుకుంది. భక్తి, నిజాయితీ లేకుండా కేవలం భుక్తి కొరకు సేవలు జరిగించే వారికొరకు సొమ్ములు అనవసరంగా ఖర్చుపెట్టక యోగ్యులైన దైవజనులను గుర్తించి, ఆర్థికంగా, భౌతికంగా సహాయం చేయటం ఆధ్యాత్మికం. అదే పని చేసింది ఈ షూనేమీయురాలు. ఈమె బహు విజ్ఞతగలస్త్రీ. ఆమె త్యాగసహితమైన విశ్వాసాన్ని దైవజనుడైన ఎలీషా గుర్తించాడు. ఆమె తనకు సంతులేదని దైవజనుని అభ్యర్థించలేదు. అయితే దైవ ప్రేరణతో ఎలీషా ప్రార్థించి "... మరుసటి యేట ఈ ఋతువున కుమారుడుండునని ఆమెతో అనెను" (2 రాజులు 4 : 16). ఆవిధంగా ఆమె నిస్వార్థమైన విశ్వాసం కుమారుని రూపంలో వికసించింది. నిజముగా దేవుని ప్రేమించి తమ క్రియలలో విశ్వాసాన్ని చూపించేవారిని దేవుడెప్పుడూ గుర్తించి సమయానుకూలమైన సహాయం చేస్తాడు.

ఆమె అద్భుత త్యాగసహిత విశ్వాసమును ఎలీషా గుర్తించి రాబోవు కరవును గూర్చిన సమాచారం అందించాడు. ఇది కేవలం ప్రవక్తలకే సాధ్యం. ఎవరుబడితే వారు ప్రవక్తలు కారు. దీర్ఘదర్శులు అనగా భవిష్యత్ జ్ఞానం గలవారు, జరుగబోవు సంగతులను పూసగుచ్చినట్లు చెప్పేవారే ప్రవక్తలు గాని, సామాన్య విషయాలను మానవ జ్ఞానంతో విశ్లేషించి ప్రజలను ఆకట్టుకునేవారు అబద్ధ ప్రవక్తలు. వారికెంత దూరంగా ఉంటే అంత మంచిది. "మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి... వారు అధిక లోభులై, కల్పనావాక్యములు చెప్పుచు, మీవలన లాభము సంపాదించుకొందురు" (2 పేతురు 2 : 1-3). "ప్రభువైన యెహోవా సెలవిచ్చినదేమనగా, దర్శనమేమియు కలుగకున్నను స్వబుద్ధిననుసరించు అవివేక ప్రవక్తలకు శ్రమ" (యెహెజ్కేలు 13 : 3). "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి..." (మత్తయి 7 : 15). "అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు" (మత్తయి 24 : 11). "... సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను అగపరచెదరు" (మత్తయి 24 : 24). ఎలీషా కొంతమంది వలె పబ్బం గడుపుకునే వెర్రి ప్రవక్త కాదు. నిజాయితీ గలవాడు. అందుకే సంభవింపబోయే కరవును షూనేమీయురాలికి తెలియచేసి సంరక్షించాడు. ఈరోజుల్లో ఒకరిని చూచి మరొకరు అన్నట్లుగా సేవానుభవములేని కొంతమంది అత్యంత విలువైన ఆధ్యాత్మిక సంగతులను అల్లరిచిల్లరగా జరిగిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. తద్వారా దేవుని నామము మరియు సంఘమును పరులు దూషించటానికి అవకాశము కల్పిస్తున్నారు. ఇది ఆధ్యాత్మిక అక్రమం. అట్టివారిని విశ్వాసులు గుర్తించి వారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

దైవజనుడు చెప్పినట్లు ఆ షూనేమీయురాలు, తన యింటివారందరిని తోడుకొని ఫిలిష్తీయుల దేశమునకు వెళ్ళి, 7 సంవత్సరములుండి కరవు కాలంలో తనను, తన

కుటుంబమును కాపాడుకుంది. దైవజనుని మాట దేవుని మాటగా ప్రకటించబడింది. కనుక యోగ్యులైన దైవజనుల మాటలను ఆలకించటం, అనుసరించటం దీవెనదాయకం. వాస్తవానికి వెంటనే కరవురాలేదు, రాబోయే కరవును గూర్చిన ప్రస్తావన జరిగించిన వెంటనే, ఆలోచించి నిర్ణయం చేస్తాననకుండా వెంటనే ఆమె అంగీకరించటం ఆమెకున్న ధృఢ విశ్వాసానికి నిదర్శనం. చాలా సందర్భాలలో దేవుడు ఒకటి చెబితే ఒకటి చేయటం, మరికొన్ని సందర్భాలలో మనకనుకూలమైతే దేవుడు చెప్పాడని భ్రమించటం జరుగుతుంది. అనుకూలమైనా ప్రతికూల మైనా దేవుని చిత్తమునకు లోబడటం ఆశీర్వాదం. కొన్ని కష్టాలు, బాధలు రావటానికి, వచ్చినవి తొలగిపోకుండా అలా దశాబ్ధాలపాటు నిలిచియుండటానికి గల ఒక ప్రధాన కారణం దేవుడు చెప్పిన మాటను, సూచనలను పట్టించుకోకపోవటం. ప్రార్ధనలు చేయటం వేరు, ప్రభువు చెప్పిన సూచనలను పాటించటం వేరు. క్రైస్తవ సంఘాలలో అనేకులు తాము గొప్ప ప్రార్ధనా పరులమని భావిస్తూ, దేవుని సూచనలను పాటించి మార్పు చేసుకోవలసిన వాటిని మార్పు చేసుకోకుండా తమ్మును తాము మోసం చేసుకుంటున్నారు. భ్రమలో భక్తి చేస్తూ, వారు చేసినట్లు మరెవ్వరూ చేయలేరన్నట్లుగా భావిస్తూ ఆధ్యాత్మిక బాధ్యతను విస్మరిస్తున్నారు. ఈ సంగతులను అందరూ పరిశీలించాలి. మనకనుకూలమైతే అవునని, మన ఆలోచనలకు, ముందుచూపుకు ప్రతికూలమనిపిస్తే దేవుని చిత్తం కాదనిచెప్పి ప్రజలను అనవసర గందరగోళంలోకి నెట్టటం కొంతమందికే సరిపోయింది.

దేవుడు చెప్పినట్లుగా, యోగ్యులైన దైవసేవకులు చెప్పినట్లుగా నడుచుకోకుండా తమకు అనుకూల బోధలను చేసేవారిని ఏర్పరచుకొని కొందరు భక్తిపేరుతో స్వంత భక్తిలో కొనసాగటం మరీవిడ్డూరం. 2 తిమోతి 4 : 3-5 - "ఎందుకనగా, జనులు హితబోధను సహింపక, దురదచెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసుకొని సత్యమునకు చెవినియ్యక కల్పనా కథలవైపు తిరుగు కాలము వచ్చును". ప్రస్తుతము దైవసేవలో సింహభాగం ఇలాంటి కార్యక్రమాలే జరుగుతున్నాయి. దేవుని మాటను ఉన్నది ఉన్నట్లు బోధించటం మాని ప్రజలను ఆకర్షించటమే ప్రధానంగా ఎంచి, భౌతికలబ్ధిని ఎక్కువగా ఆశించే బోధలుచెప్పి ప్రజలను దేవుని పేరుతో మభ్యపెడుతు న్నారు. వీరినే అనేకమంది ప్రజలు విచక్షణలేక వెంబడించటం కడవరికాల ఒక సూచనగా భావించాలి...?? దేవుడు చెప్పమన్నదే దైవదాసులు చెప్పాలి. అప్పుడే ప్రజలు తమ తమ బాధలలోనుండి, కరవులలో నుండి విముక్తులౌతారు.

మరొక సమస్యేమిటంటే, యోగ్యులైన దైవదాసులున్నా వారిని వెంబడించి సంరక్షింప బడేవారి సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. ఎంతోమందితో ప్రార్ధనలు చేయించుకుంటున్నారు గాని, వారున్న మానసిక స్థితి, ఆధ్యాత్మిక స్థితిలోని లొసుగులను మార్చుకోకుండా కాలక్షేపం చేస్తున్నారు. ప్రార్ధనతోపాటు పరివర్తన ప్రగతిని సాధించటానికి కారణమౌతుంది.

దైవజనుడైన ఎలీషా మాటను దేవుని మాటగా భావించిన షునేమీయురాలు మరియు కుటుంబం పొరుగునున్న ఫిలిష్తీయుల దేశమునకు వలసవెళ్ళి 7సంవత్సరములు నివసించింది. కరవును తప్పించుకోవటానికి ఫిలిష్తీయుల దేశం వెళ్ళటమేకాదు 7 సం॥ల తరువాత తిరిగి

మాతృదేశానికి కుటుంబమంతా వచ్చారు. వెళ్ళటం తెలిసినవాళ్ళందరికి తిరిగి రావటం తెలియదు. వెళ్ళినచోట అన్నీ బాగుండి, మనకనుకూలంగా ఉంటే, దానినే దేవుని చిత్తంగా భావించి ఉండవలసిన సమయంకంటే ఎక్కువగా అక్కడ నివశించి దేవుని ప్రణాళికను భంగపరుస్తున్నారు. వెళ్ళమన్నవాడే రమ్మంటున్నాడు. ఆ మెళకువను తెలుసు కున్నవారే నిజమైన దైవజ్ఞానంగల భక్తులు.

2 రాజులు 8 : 3 - ఏడు సంవత్సరములు ఫిలిష్తీయుల దేశంలో ఉండి తిరిగి తన మాతృ దేశానికి వచ్చింది. ఆమె దేశంలో లేనిసమయములో తన భూమి, ఆస్థి అన్యాక్రాంత మయ్యింది. రాజైన యెహోరామును సంప్రదించగా, ఆమె కుటుంబ చరిత్రను తెలుసుకొని ఒక అధిపతిని నియమించి ఆమె ఆస్థినంతటిని యిప్పించాడు.

అభివృద్ధి, ఆశీర్వాదం కేవలం ఒకని కష్టమువలన మాత్రమే సంక్రమించవు. ఆ కష్టానికి దేవుని కృప ఎంతో అవసరం. దానికితోడు దేవుని సూచనలను పాటించటం మరింత ప్రాముఖ్యం. దేవునికొరకు, యోగ్యమైన సంఘముల విస్తరణ కొరకు వితరణ చూపించేవారిని దేవుడెప్పుడూ ఆలోచననిచ్చి నడిపిస్తాడు. వారి నమ్మకత్వానికి ప్రతిఫలాన్ని దేవుడే ఇస్తాడు. షూనేమీయురాలు తనకు సంతానప్రాప్తి కలుగుతుందని ఎలీషాకు గది కట్టించలేదు. భక్తిగల దైవజనుడని గుర్తించి మాత్రమే అంతగొప్ప పనిచేసింది. ఆమె మంచితనాన్ని, నిస్వార్ధ భక్తిని పరలోకం గుర్తించి కష్టకాలంలో దైవసహాయం దొరికింది. అనవసర ఆలోచనలు, వ్యర్థమైన ప్రణాళికలు ప్రక్కనబెట్టి నిర్మలమైన బుద్ధితో ప్రభుని సేవించి, ఆయన చెప్పినట్లు నడుచుకుంటే ఆనందం, అభివృద్ధి మరియు ఆశీర్వాదం లభిస్తాయి. దేవునికి లోబడి అందరూ అన్ని విధములైన దీవెనలు పొందుకుందాం. **( సశేషం )**


## సంగీత, సాహిత్య ప్రియులకు ప్రకటన

**డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి కలం నుండి వెలువడిన, నిరీక్షణ మెలోడీస్ సమర్పణలో వాల్యూం-3 ఆత్మాంజలి గీతమాలికను మరనాత విశ్వాస సమాజం, వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారి ఆశీస్సులతో డిశంబరు 25 న హైదరాబాదులోనూ, డిశంబరు 31 న విజయవాడలోనూ ఆవిష్కరించటమైనది. అందులో ఆత్మాంజలి పాటలతోపాటు, యింతకు ముందు మేము రూపొందించిన హృదయాంజలి, స్తోత్రాంజలి గీతమాలికలు మరియు మాన్యశ్రీ మోజెస్ చౌదరి గారి ప్రసంగాలు, డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి ప్రసంగాలు అందించటమైనది. ఈసారి ప్రజల సౌకర్యార్థం 16 జి.బి. పెన్‌డ్రైవ్‌లో పైన ప్రస్తావించిన పాటలు, ప్రసంగాలు పొందుపరచాము. కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలసినదిగా మనవి. మీ పూర్తి అడ్రస్సు, ఫోన్ నెంబరుతో రూ.500/-లు పంపి కొరియర్ ద్వారా పొందగలరు.**

**-: BANK DETAILS :-**
**ORIENTAL BANK OF COMMERCE**
**MARANATHA VISVASA SAMAJAM**
**SB. A/c.No.10932011013854**
**IFSC : ORBC0101093**
**Ameerpet, Hyderabad - 16.**




**డా॥ నిరీక్షణ కె. కంచర్ల**
**మరనాత గ్రౌండ్స్, 12-7-133/81/2/1**
**రాఘవేంద్ర నగర్, కుకట్‌పల్లి**
**హైదరాబాదు-500 072.**
**సెల్ : 98497 46464**

# ప్రమాదపు అంచుల్లో

సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ

మరనాత మెసేంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామమున శుభములు.

**B) ప్రమాణం (ఆది 50 : 5) :-** "నా తండ్రి నాచేత ప్రమాణము చేయించి - ఇదిగో నేను చనిపోవుచున్నాను, కనానులో నా నిమిత్తము సమాధి త్రవ్వించితిని గదా, అందులో నన్ను పాతిపెట్టవలెనని చెప్పెను. కాబట్టి సెలవైతే నేనక్కడికి వెళ్ళి నా తండ్రిని పాతిపెట్టి మరల వచ్చెదనని చెప్పుడనెను".

దేవుని అనుమతిచొప్పున ఐగుప్తుకు వెళ్ళిన యాకోబు తన పెద్దరికమును కాపాడుకున్నాడు. తాను పొందిన దీవెననే పరులకు పంచిపెట్టాడు. తన జీవితములో దేవుడు జరిగించిన గొప్ప కార్యములను గూర్చి, దేవుని యొక్క వాగ్దానమును గూర్చి యిటు తన కుమారులకు, అటు మనుమ సంతానమునకు స్పష్టంగా తెలియచేశాడు. దేవుని వాగ్ధానము నెరవేర్చ బడాలంటే తాను, తన తండ్రులు ఏవిధంగా లోబడ్డారో, అదేవిధంగా తన కుమారులు లోబడాలని ఆశించే, వారికి స్పష్టంగా వాగ్ధానము గూర్చి తెలియచేశారు. అబ్రహాముకు చేయబడిన వాగ్ధానమునుగూర్చి, అబ్రహాము తన కుమారుడైన ఇస్సాకునకు తెలియచేశాడు. ఇస్సాకు కూడా వారి కుమారులకు ఈ వాగ్ధానము యొక్క విలువను తెలియచేసియుండవచ్చు. జీవితంలో గురి, గమ్యం లేకుండా పారిపోతున్న యాకోబు వాగ్ధాన విలువను గ్రహించే స్థితిలో లేనప్పుడు దేవుడే తన వాగ్ధానమును దర్శనరూపంలో వెల్లడించాడు. తన మామగారైన లాబాను యింటిలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యములతో బ్రతుకుతూ, కుటుంబ మును, ఆస్థిలను వృద్ధిచేసుకుంటున్న సమయంలో దేవుడే, యాకోబును దర్శించి వెనుకకు పిలిచాడు (ఆది 31 : 13). దేవుని మాటకు విధేయుడైన యాకోబు దేవుడు చెప్పిన స్థలముకు తిరిగివచ్చేశాడు. యాకోబు తాను దేవుని నుండి పొందిన వాగ్ధానమునుగూర్చి తన కుటుంబమునకు వివరించి చెప్పి వారిని సిద్ధము చేసియుంటారనుటకు లేఖనములలోని కొన్ని సంఘటనలు ఋజువుగా నిలుస్తాయి. అయితే పరిస్థితులు, సమస్య లు కొన్నిమార్లు మనము వేరొక మార్గములో పయనించేటట్లు చేస్తాయి. కనుకనే యాకోబు కూడా తన యింటిమీదకు వచ్చిన కరువు కారణంగా ఐగుప్తుకు వెళ్ళవలసి వచ్చింది. వాగ్ధాన దేశముకు వెళ్ళుటకు తన కుటుంబమును సిద్ధముచేసి, యిక తన చివరి దశకు చేరుకున్నాడు. అయిననూ తన పట్టుదల, దేవుని యందలి విశ్వాసము, వాగ్ధానము పట్ల నమ్మకము విడువకుండా ఉన్న యాకోబు తన పార్థీవదేహమైనా వాగ్ధాన దేశంలో ఉంటే చాలని కోరుకున్నాడు. బ్రతికిఉన్నప్పుడు చేయలేని పని, చనిపోయిన తరువాత ఎలా చేయగలడు? మానవులలో సహజమైన ఒక బుద్ధి ఉంది. అదేమనిన, బ్రతికిఉన్న మనిషి చెప్పే 100 మాటలకంటే, చనిపోతూఉన్న వ్యక్తిచెప్పే ఒక్కమాట గొప్పదిగాను, ఉన్నతంగాను కనిపిస్తుంది. అది నెరవేర్చాలని ఆ కుటుంబ

సభ్యులు తాపత్రయపడతారు. అందుకే యాకోబు ఈ అవకాశమును వదులుకోదలచుకో లేదు. తాను బ్రతికివున్న కాలంలో తన కుటుంబమును వాగ్దాన దేశం చేర్చలేకపోయాడు, కనీసం ఈ చివరి క్షణమునైనా వారిని కనాను చేర్చాలనుకొని, తన దేహమును కనానులోనే పాతిపెట్టాలని తెలియజేశాడు. తాను చేయించుకున్న ప్రమాణముతోనైనా ప్రజల మనస్సు లలో మార్పు వస్తుందని ఆశపడ్డాడు. తాము తిరిగి తమ దేశముకు వెళ్ళిపోతామంటే, వారిని అడ్డగించేవారు ఎవ్వరూ లేరనేచెప్పాలి. ఏవిధముచేతనైననూ తన సంతతిని కనానులో చేర్చుటయే యాకోబు లక్ష్యము. దేవుని భయము, దైవభక్తి యొక్క విలువ, దైవచిత్తమును నెరవేర్చుటలో ఉన్న ఆనందము మనిషికి తెలిస్తేనే భక్తిలోని దీవెనలు పొందగలడు. ఇవ్విధమైన సత్యాలు తన కుటుంబముకు నేర్పటానికి యాకోబు పలువిధాలుగా ప్రయత్నించాడు. కాని ఈ కుటుంబముకు ప్రమాణము నెరవేర్చటం అంతగా కుదరలేదనే చెప్పాలి. ప్రమాణము (వాగ్దానం) యొక్క ప్రామాణ్యత అంతగా తెలియనందువలన వచ్చిన అవకాశమును జారవిడుచుకున్నారు. ఒకవ్యక్తి, ఒక కుటుంబము దైవచిత్తమును నెరవేర్చుటలో వెనుకంజ వేస్తే, ఎదుర్కొనబోయే ప్రమాదాలు ఏవిధంగా ఉంటాయో ఈ ఇశ్రాయేలీయుల సంఘటన ద్వారా గ్రహించవచ్చు.

**C) ప్రమాదము (ఆది 50:6-8):** "అందుకు ఫరో - యాకోబు నాచేత చేయించిన ప్రమాణము చొప్పున వెళ్ళి నీతండ్రిని పాతిపెట్టుమని సెలవిచ్చెను. కాబట్టి యోసేపు తన తండ్రిని పాతిపెట్టుటకు పోయెను. అతనితో ఫరో యింటి పెద్దలైన అతని సేవకులందరును ఐగుప్తు దేశపు పెద్దలందరును, యోసేపు యింటివారందరును అతని సహోదరులును అతని తండ్రి యింటివారును వెళ్ళిరి. వారు తమ పిల్లలను, తమ గొర్రెల మందలను, తమ పశువులను మాత్రము గోషేను దేశములో విడిచిపెట్టిరి".

యాకోబు తన మరణము, సమాధిని గూర్చి ముందుగానే యోసేపుకు తెలియచేసి ప్రమాణము చేయించుకున్నాడు. జ్యేష్ఠకుమారుడైన రూబేనుకు చెప్పకుండా యోసేపుకు ఎందుకు చెప్పినట్లు? కారణము ప్రమాణము విలువ తెలియనివారికి ఏమి చెప్పినా వ్యర్థమే, వారు తమ యిష్టానుసారముగా జీవించుదురు గనుక ఏ విలువను వారు గ్రహించలేరు. ప్రమాణము, దైవచిత్తము యొక్క విలువను తెలుసుకున్న వ్యక్తి యోసేపు కనుకనే యాకోబు తనకు మాత్రమే తెలియచేశాడు. యోసేపును అడగటం తప్పుకాదు, నేరవేర్చటం అంతకంటే తప్పుకాదు. కాని యిక్కడ జరిగిన సంఘటన మనము అర్థం చేసుకోవాలి. అతిథుల్లా ఐగుప్తుకు వచ్చిన యాకోబు కుమారులు, అదే గౌరవం నిలబెట్టుకొని తిరిగివెళ్ళే గొప్ప అవకాశం యిది. కాని వీరు పెద్దలు మాత్రమే వెళ్ళి తమ కుమారులు, కుమార్తెలను, ఆస్థులను ఐగుప్తులో విడిచిపెట్టారు. అంటే మళ్ళీ తిరిగి వారు అక్కడికే రావాలి కదా! ఈ కుటుంబాలకు ఐగుప్తు బాగానచ్చిందనే చెప్పాలి. దైవచిత్తముతో వీరికి పని లేదు. చాలామందికి ఈరోజుల్లో తమ కోర్కెలు, తమ యిష్టము, తమ అవసరతలు తీరితే చాలు. ఏమాత్రం ఆలస్యమైనా తట్టుకోలేరు, ఎవరికైనా దైవచిత్తము వలన

ఆలస్యమైతే వారిని హేళన చేయటమో, ఇంకేం జరుగుతుందిలే అని నిరాశపరచటం వీరి పని. ఇలాంటి వారి భక్తి ఏస్థాయిలో ఉందో యిట్టే గ్రహించవచ్చు. మనము ప్రార్థన చేయగానే దేవుడు కూడా మనకు అనుకూలంగా త్వరత్వరగా స్పందించి, ఆశీర్వదించాలి, అప్పుడే కొందరు హాయిగా భక్తి చేస్తారు. చల్లనిచోట పంట కూర్చుకొనే భక్తి చేసేవారు చాలామంది ఉన్నారు. దైవచిత్తము కలిగిన పాలుతేనెలు ప్రవహించే దేశముకంటే, దైవచిత్తములేని వెండి, బంగారం కలిగి, నశించిపోయే నైలు దేశాన్ని కోరుకొనేవారు చాలామంది ఈ రోజుల్లో కనబడుతున్నారు. ఉన్న అవకాశమును జారవిడుచుకొని తమ తండ్రియైన యాకోబును సమాధిచేయటానికి వెళ్తున్నామనుకున్నారు కాని తమ ఉజ్వల భవిష్యత్తునే సమాధి చేయబోతున్నారనే విషయం గ్రహించలేకపోయారు. వారు పోగొట్టుకొన్న భవిష్యత్తు విలువ 400 సంవత్సరాలు. మరి వీరి భక్తికి, జీవితాలకు అర్థం ఏమిటి? యాకోబు సంతానము, తమ పిల్లలకు వాగ్ధాన దేశము యొక్క రుచిని, అందాలను చూపించలేకపోయారు. అందుకే తరువాతి కాలంలో మోషే ఫరోయొద్దకు వెళ్ళి తన ప్రజలను పంపించమని అడిగితే ఫరో ఈవిధంగా అన్నాడు- నేను మిమ్మును, మీ పిల్లలను పోనిచ్చెదనా? (నిర్గమ 10 : 11); మీ మందలు, పశువులు మాత్రమే యిక్కడ ఉండవలెను (నిర్గమ 10 : 24). గతంలో వారు చేసిన పనినే ఫరో చెప్పి వారిని బహుగా బాధపెట్టెను. దీవెన పొందుకున్నామా? దీవెన పొందుకోలేదా? అనేవి ప్రాముఖ్యమైనవి కాదు కాని దైవచిత్తములో ఉన్నామా? లేదా? దైవచిత్తమును నెరవేర్చు చున్నామా, లేదా? అనేవి ముఖ్యమైనవి కదా! ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బహుగా విస్తరించారు, కాని వారు బానిసత్వంలో బహుగా దుఃఖపడ్డారు. దీవెన ఉంది కాని దైవచిత్తం లేదనే చెప్పాలి. మనం మాట్లాడుకునే ఒక సహజమాట గుర్తుకొస్తుంది - ఆపరేషన్ విజయ వంతంగా జరిగింది కాని రోగి చనిపోయాడు) అంటే విజయం, ప్రాణం ఒకదానితో ఒకటి ఏకీభవించాలి లేకపోతే వానికి అర్థం లేదు. ఇవ్విధముగానే దీవెన, దైవచిత్తము ఒకదానితో ఒకటి ఏకీభవించాలి. లేనియెడల మన భక్తికి అర్థం ఉండదు. వీరియొక్క పని వలన ప్రమాదము ముంచుకొచ్చింది. తరువాత కొద్దికాలానికి యోసేపు చనిపోయాడు. ఆహ్వానించిన యోసేపు, వెళ్దామన్న యాకోబు, అండగా ఉన్న ఫరో వంటి వ్యక్తులు ముగ్గురు చనిపోయారు. యిక ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి ఏవిధంగా బయటకు రాగలరు? వీరి తలంపులే వారి తలంపులు మూసేటట్లు చేశాయి. వారి తరాలను ప్రమాదపు అంచుల్లోకి నెట్టివేశాయి.

ప్రియ పాఠకులారా, దేవుని యెదుట మీరు సమర్పించుకున్న ఏ సమర్పణనైననూ తప్పక నెరవేర్చండి. ఎట్టి పరిస్థితుల్లోనూ దేవుని యెదుట శాపమును కూర్చుకొనవద్దు. ఒక్క అవివేకపు ఆలోచన, అవకాశాలను జారవిడుచుకొనేటట్లు చేసింది. అందుకనే వారి ప్రయాణము, ప్రమాణము ప్రమాదపు కోరల్లోకి చేర్చింది. కనుక మన భావితరాలు భక్తి చేసేటట్లు వారికి మార్గదర్శకంగా నిలుద్దాం. ఈనాటి నిర్ణయాలే రేపటి ఫలితాలు. ఈనాటి ప్రమాణ నెరవేర్పులే రేపటి తరానికి ఆశాజనకం.

**- మరనాత.**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక
## ( 8 వ భాగము )

**రెవ. అల్లూరి విశ్వప్రసాద్, విజయవాడ**

## కృపలో ఐక్యత :

ప్రభువునందు ప్రియ పాఠకులకు గుడ్‌ఫ్రైడే మరియు ఈస్టర్ శుభాకాంక్షలు.

గత కొన్ని నెలలుగా ఎఫెసి పత్రిక నుండి ధ్యానంచేస్తున్నాం. ఈ సంచికలో 4వ అధ్యాయం ధ్యానంచేద్దాం. 3వ అధ్యాయములో దేవుడు మనలను పిలిచిన పిలుపు, దానికి తగినట్లు జీవించటం, క్రీస్తులో మన ఐశ్వర్యం, ఆత్మీయస్థితి, మనం ప్రార్థనలో ఎలా బలపరచబడాలి అనే అద్భుతమైన సంగతులు పౌలు వివరించెను. 4వ అధ్యాయంలో దేవుని పిల్లలముగా, ఆయన వారసులముగా వారసత్వాన్ని మనం ఎలా కలిగిఉండాలి, మనం క్రీస్తు శరీరముగా ఏకత్వము కలిగి ఎలా ఉండాలి, క్రీస్తులో మనయొక్క బాధ్యతలు ఏమిటి అనే విషయాలు తెలియచేస్తున్నాడు.

ఎఫెసీ పత్రికలో మొదటి 3 అధ్యాయాలు ఒకపునాది అయితే తరువాత 3 అధ్యాయాలు వాటిపై కట్టడాన్ని నిర్మించడము. మొదటి మూడు అధ్యాయాలు సిద్ధాంతపరమైనవి అయితే తరువాత మూడు అధ్యాయాలు ఆచరణాత్మకమైనవి. సిద్ధాంతము ఎంత ప్రాముఖ్యమో ఆచరణ కూడ అంతే ప్రాముఖ్యము. పిలుపు యొక్క ప్రాముఖ్యతను ప్రతిరోజు క్రియలలో చూపించాలి. ఉదాహరణ : విశ్వాసమంటే ఏమిటి అని నేర్చుకున్నాం, ఇప్పుడు విశ్వాసమనేది క్రియలలో కనిపించాలి. ప్రేమను గురించి తెలుసుకున్నాం, నాలో ప్రేమ ఉంది అనిచెబుతాం. ఆప్రేమ నీచేతల్లో, ప్రవర్తనలో కనిపించాలి. అవి క్రియలలో కనపరచనప్పుడు ఎన్ని నేర్చుకొన్నా ఏమి ప్రయోజనం? మనం జీవితంలో 4 విధాలుగా నడుచుకోవాలని 4,5,6 అధ్యాయాలలో చూస్తాం. ఎట్లనగా, **1. ఐక్యతతో నడవాలి, 2. పవిత్రతలో నడవాలి, 3. సమాధానముతో నడవాలి, 4. విజయములో మనం నడవాలి** అని వీటిని గురించి తరువాత లేఖనభాగములలో నేర్చుకొందాం. మొదటిగా ఐక్యతలో నడుచుకొనుటను గురించి ధ్యానంచేద్దాం.

**"కాబట్టి, మీరు సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణవినయముతోను సాత్వికముతోను నడుచుకొన వలెనని, ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలుకొనుచున్నాను" (ఎఫెసీ 4 : 1-3).**

**1. ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట :-** పరిశుద్ధాత్మదేవుడు కలిగించు ఐక్యతను మనం కాపాడుకోవాలి, పాడైపోకుండా చూచుకోవాలి. విశ్వాసులు ఐక్యతలో, పవిత్రతలో కలసి నడుస్తున్నప్పుడు అందరూ సంతోషిస్తారుకాని, సైతాను ఏమాత్రం సంతోషించడు. విశ్వాసుల ఐక్యతను పాడుచేయడానికి శోధిస్తాడు, ఆ శోధనలలో చాలామంది అపజయం

పొందుతారు. ఎంతో సంతోషముగా ఉండవలసిన కుటుంబాలను, సంఘాలను అపవాది అనైక్యతతో చెదరగొడుతున్నాడు. కాని ఎటువంటి పరీక్ష ఎదురైన మీరు నేర్చుకొన్న వాక్యమును అనుసరించి విధుల్లోకి ఉత్సాహంగా వెళ్ళండి, కలసి ప్రోత్సహించుకోండి, దేవునితో మనమెప్పుడూ కలసిఉండాలి మరియు మీరు కుటుంబములో భార్య భర్తలు పిల్లలు ఎప్పుడూ కలిసిఉండాలి. ఏ నిర్ణయాలు తీసుకోవాలన్నా దేవుని సన్నిధిలో మనం ప్రార్థించి దేవుడు తెలియపరచిన దానిప్రకారంగా కొనసాగాలి. వాక్యము నేర్చుకొని, అభ్యాసము చేయుట దేవుడు మనకిచ్చిన గొప్ప అవకాశము. "మీరు సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు **ఐక్యతను కాపాడుకొనుడి" (ఎఫెసీ 4 : 1).** యేసు - **"నేనును తండ్రియు ఏకమైయున్నామని వారితో చెప్పెను"** (యోహాను 10 : 30).

**2. పిలువబడిన పిలుపుకు తగినట్లుగా :-** దేవుని పిలుపు మరియు దానికి తగినట్లుగ మనము ఏదైతే నేర్చుకొన్నామో దానిని మనం అనుసరించి చూపించాలి. క్రీస్తులో మనమందరం ఒక్కటే. లోకంలో ఎన్నో వర్గములు, ఎన్నో నమ్మకాలు, సిద్ధాంతాలు ఉన్నాయి. ఎన్నిఉన్నప్పటికి క్రీస్తులో ఏ సంఘమైన, సంస్థయైన ఎవరు ఏమి విశ్వసిస్తున్నా ఎవరైనా క్రీస్తులో ఒక్కటిగా ఉండటానికి దేవుడు తన కుమారుడిని పంపించి మనందరిని ఒకటిగా చేస్తే మనం విభజించుకొనిఉన్నాం. ఒక్కొక్కరు ఒక్కొక్క నమ్మకాలు, ఆధిపత్యాలు, ఎవరికి ఇష్టమైనట్లుగా వారు నడిపించటము వలన దేవుని నూతనముగా అంగీకరించేవారికి ఇది కలవరపెడుతున్నది. ఇక్కడ మనం **'క్రీస్తులో ఐక్యత, క్రీస్తులో మన బాధ్యత'** అనేది ఒక్కటే చూడాలి. యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించి, యేసు రక్తములో కడుగబడిన వారందరు ఒకే కుటుంబము. వారు పిలుపుకు తగిన జీవితమును అనగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకోవాలని పౌలు బ్రతిమాలుకొనుచున్నట్లుగా కనబడుతుంది.

**3. ప్రభువును బట్టి ఖైదీయైన పౌలు :-** పౌలు తాను ఒక ఖైదీని అంటున్నాడు. 3 : 1 లో ఈ హేతువుచేత అన్యజనులైన మీనిమిత్తము **క్రీస్తు యేసు యొక్క ఖైదీనైన** పౌలను నేను ప్రార్థించుచున్నాను. ఫిలిప్పి 1 : 13, ఫిలేమోను 1 : 9-13, 2 తిమోతి 1 : 8 లోను **క్రీస్తు యేసు ఖైదీని** అని చెబుతున్నాను. క్రీస్తు నిమిత్తము నేను ఖైదీని అని చెబుతున్నాడు. గుర్తు పెట్టుకోండి - మీ జీవితంలో దేవున్ని నమ్ముకొన్నందుకు ఎప్పుడైన క్రీస్తు నిమిత్తము ఎటువంటి శ్రమ, నింద, అవమానములు పడిన మీరు భయపడవలసిన పనిలేదు. మనవల్ల తప్పు, పొరపాటు జరిగితే మనం భయపడాలి, దానిలోనుంచి బయటకు రావాలి గాని, దేవున్ని నమ్మినందుకు బంధువులు, స్నేహితులు, పొరుగువారేమనుకుంటారో, రావలసిన ఆశీర్వాదాలు ఆగిపోతాయేమోననే ఆందోళన మీరు ఎప్పుడూ చెందనవసరంలేదు. 'వారు క్రీస్తు పరిచారకులా?, నేనును మరి ఎక్కువగా క్రీస్తు పరిచారకుడను. మరివిశేషముగా ప్రయాసపడితిని, మరి అనేక పర్యాయములు చెరసాలలో ఉంటిని; అపరిమితముగా దెబ్బలు తింటిని, అనేకమారులు ప్రాణాపాయములలో ఉంటిని' (2 కొరింథి 11 : 23). క్రీస్తు నిమిత్తము!!

అని పౌలు భక్తుడు తన స్థితిని ఇక్కడ చెబుతున్నాడు.

'నా బంధకములలో నేను కనిన నా కుమారుడగు ఒనేసిము కోసరము నిన్ను వేడుకొనుచున్నాను. అతడు మునుపు నీకు నిష్ప్రయోజనమైనవాడే గాని, ఇప్పుడు నీకును నాకును ప్రయోజనకరమైనవాడాయెను... నేను సువార్తకొరకు బంధకములో ఉండగా నీకు ప్రతిగా అతడు నాకు పరిచారము చేయునిమిత్తము నాయొద్ద అతనినుంచుకొనవలెనని యుంటిని' (ఫిలేమోనుకు 1 : 10-13). ప్రతికూలతల మధ్యలో క్రీస్తు నిమిత్తము ఖైదీగావున్నా, నిందలు అనుభవిస్తున్నా దేవునితో సహవాసాన్ని, సత్సంబంధాన్ని మనమెప్పుడూ కోరుకోవాలని పౌలు వీటినిగూర్చి చాలా స్పష్టంగా చెప్పుకొస్తున్నాడు. తాను కలిగియున్న స్థితిని, దానికి తగినట్లుగా జీవించాలని ఇక్కడ ప్రస్తావిస్తూ ఉన్నాడు.

**4. కృపలో ఐక్యతను కాపాడుకొనుట :-** దేవుని సంఘములో సభ్యుడుగా ఉన్న వ్యక్తి ఆ సంఘములో విధులను నిర్వర్తించడానికి తప్పనిసరిగా కొన్ని యోగ్యతలను కలిగిఉండాలి. సంఘనాయకులు, పరిచారకులు, విశ్వాసులు ప్రతిఒక్కరు విధులు సరిగా నిర్వర్తించడములో తప్పిపోయినట్లయితే దేవునిసంఘానికి, బయటసొసైటిలో దేవుని నామానికి చాలా నష్టం కలిగించిన వాళ్లమవుతాం, జాగ్రత్త ! అని ఈ విషయములో పౌలు హెచ్చరిస్తున్నాడు. ఒక విశ్వాసి సంఘములో తన విధులను ఏవిధంగా కాపాడుకోవాలో అపోస్తలుడైన పౌలు ఎఫెసీ 4 : 1-3 వచనాలలో 5 ప్రాముఖ్యమైన విషయాలు చెబుతున్నాడు. **A) విధేయత, B) సాత్వికము, C) దీర్ఘశాంతము, D) ప్రేమ, E) సమాధానము.** వాటినిగూర్చి తెలుసుకొందాం-

**A) విధేయత :-** యేసుక్రీస్తు పరలోకమును విడిచిపెట్టి తండ్రి చిత్తమును నెరవేర్చుటకు తననుతాను రిక్తునిగా చేసుకొని తన ప్రాణాన్నర్పించిన విధము అద్భుతం. తండ్రి చిత్తమునకు యేసుక్రీస్తు ఎంత విధేయుడయ్యాడు, ఆయనకు మనమెంత విధేయత కలిగిఉన్నాం అనేది చూచుకోవాలి. ఈలోకములో మనము ఎంత జ్ఞానవంతులైన, విద్యాధికులైనా అన్నిటిని మించినది విధేయత, సాత్వీకమైన మనస్సు. ఇట్టి విధేయతను మనం పట్టుకోవాలి, కాపాడుకోవాలి. విధేయతలో క్రీస్తును పోలిన జీవిత విధానము మనము కలిగిఉండాలి.

**B) సాత్వికము :-** సాత్వికము లేదా మృదుత్వము క్రైస్తవులకు ఉండవలసిన మరొక అద్భుతమైన సుగుణము.

**C) దీర్ఘశాంతము :-** దీర్ఘశాంతము అంటె అంతము వరకు సహించి ఉండటము. బహుమానము పొందుటకొరకు అంతము వరకు సహించవలెను. మీరెంత సహనము కలిగిఉన్నారో ప్రజలు చూస్తారు. ఆయన బోధకుడేకాని సహనముతక్కువ అంటారు. భక్తిచేసే మనలో ఇటువంటి బలహీనతలు ఉండకూడదు.

**D) ప్రేమ :-** ఇక్కడ నాలుగు రకాలైన ప్రేమలను గురించి మనం తెలుసుకోవాలి.

**1. ఎరోస్ :** ఇది భార్యభర్తల మధ్యనున్న శారీరక బంధాన్ని సూచించే ప్రేమ. ఈ భౌతికమైన

బంధాన్ని పవిత్రమైనదిగా దేవుడుపెట్టాడు. దేవుడు పవిత్రంగా చేసిన ప్రతిది అపవాది అపవిత్రంగా మార్చేసాడు. **2. ఫిలియో :** స్నేహితుల మధ్య ఉండే ప్రేమ. **3. స్టోర్గే :** రక్త సంబంధులు, బంధువులు మధ్య ఉండే ప్రేమను సూచిస్తుంది. **4. అగాపే :** ఇది దేవుని ప్రేమ. అగాపే అనగా ఎవరూ జయించలేని కనికరమని అర్థం. ఈ ప్రేమ అద్భుతమైనది.

**E) సమాధానము :-** మీరు దేవుని సమాధానమును కలిగి జీవిస్తున్నారంటే విధేయత, సాత్వీకము, దీర్ఘశాంతము, ప్రేమ ఇవన్నీ మిమ్ములను సమాధానములోనికి నడిపించాయి. సమాధానమునకు ఇవన్నీ మెట్లు. అసమాధానమునకు కారణాలు అవిధేయత, సాత్వీకము లేకపోవుట, అసహనము, ప్రేమ లేకపోవుటయే. ఇటువంటి దైవిక సమాధానము పవిత్రత, ఐక్యతలోనికి నిన్ను నడిపిస్తాయి. ఐక్యత, సమాధానము - సరియైన సంబంధబాంధవ్యాలను భద్రము చేస్తాయి. మనజీవితంలోనుంచి 'నేను' అనేవ్యక్తి పోవాలి, 'మనము' అనే స్థితికి రావాలి. అంత తేలికకాదు సుమా! ఇవన్నీ దేవుడు నాకు నేర్పిస్తూవచ్చాడు.

**"నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చు కొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును"** (మత్తయి 11 : 29). ఒక్కోమారు మీ ప్రాణము విసిగి వేసారిపోవటానికి కారణమేమంటే - మీరు దేవుని వాక్యము నేర్చుకోవడం లేదు, పాటించడము లేదు. **"మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసుకొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను"** (ఫిలిప్పీ 2 : 7,8). ప్రభువైన యేసుక్రీస్తు మనకు ప్రతివిషయములోనూ మాదిరి. పైన తెలియచేసిన ఐదు ప్రాముఖ్యమైన దైవిక గుణలక్షణములను నేర్చుకోకుండా మన జీవితాలలో ఐక్యత రానేరాదు. పిలుపుతో ప్రవర్తన ఐక్యమైఉండాలి. సిద్ధాంతం, విధులు అనుసంధానమై ఉండాలి.

**5. ఐక్యత అనే పునాదిపై విధులను నిర్వర్తించుట :-** విశ్వాసులలో ఉండవలసిన ఐక్యత దైవాత్మ ప్రేరితమైనదై ఉండాలి. "ఏలాగు శరీరము ఏకమైయున్నను అనేకమైన అవయవములు కలిగియున్నదో, ఏలాగు శరీరముయొక్క అవయవములన్నియు అనేకములైయున్నను ఒక్క శరీరమైయున్నదో, అలాగే క్రీస్తు ఉన్నాడు. ఏలాగనగా, యూదుల మైనను, గ్రీసుదేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనుషులందరము ఒక్క శరీరములోనికి, ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసిన వారమైతిమి" (1 కొరింధి 12 : 12,13).

"శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికిపైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసి 4 : 4-6). ఈ వచనంలో ఏకత్వములో ఉన్న ఏడు రూపాలను వర్ణిస్తున్నాడు. **1.** ఒకే శరీరము (ఇక్కడ సంఘమును శరీరముతో పోల్చిచెప్పెను)

**2.** ఒక్కటే ఆత్మ, **3.** ఒక్కటే నిరీక్షణ, **4.** ఒక్కడే ప్రభువు, **5.** ఒకే విశ్వాసము, **6.** ఒకే బాప్తిస్మం, **7.** ఒకే తండ్రియైన దేవుడు.

తండ్రి యైన దేవుని యొక్క మూడు లక్షణములు **1.** అందరికి పైగా ఉన్నవాడు, **2.** అందరిలో వ్యాపించి ఉన్నవాడు, **3.** అందరిలో ఉన్నవాడు.

ఐక్యతకు మూలకారణమైన **ఐదు** అద్భుతమైన లక్షణములను, **ఒక్కటి**గా ఉన్న **ఏడు** సంగతులను, **మూడు** దేవుని గుణలక్షణములను తెలుసుకొన్నాం. త్రిత్వమైయున్న దేవుడు అనగా- అందరికి ఒక్కడే తండ్రియైన దేవుడు, ఒక్కడే ప్రభువైన యేసుక్రీస్తు (యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించిన వారందరికి ఆయన ప్రభువైయున్నాడు), ఒక్కడే పరిశుద్ధాత్ముడు. తండ్రి కుమారుడు పరిశుద్ధాత్ముడు ఒక్కటే, కాని పనులు వేరు. లోకములో ఉన్న వారందరికి పరలోకపు తండ్రి దేవుడైయున్నాడు. లోకములోనుంచి ప్రత్యేకించబడి పాపములనుండి విడిపించబడి క్రీస్తును స్వరక్షకునిగా అంగీకరించి బాప్తిస్మముపొందిన వారము మాత్రమే క్రీస్తు కుటుంబముగా, ఒక సంఘముగా ఏర్పడియున్నాము. సంఘములో సభ్యులుగా చేర్చబడిన మనము ఇప్పుడు పరిశుద్ధాత్మదేవునితో ఉన్నాము. ఒకే నిరీక్షణతో ఉన్నాము. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు ఒక్కటే మాట, ఒక్కటే చిత్తము కలిగియున్నాడు. ఆ ఆత్మ నడిపించినట్లుగా మనము జీవించాలి. విశ్వాసులందరూ ఒక్కటే కాబట్టి, సంఘమునకు శిరస్సు అయిన క్రీస్తు తండ్రికి విధేయత చూపించినట్లుగా మనము ఆయనకు విధేయత చూపిస్తూ, ఆయన ఆజ్ఞలను, కట్టడలను నిర్వర్తిస్తూ ఐక్యత, శాంతిసమాధానములతో ముందుకు సాగిపోవాలి. అట్టి కృపను దేవుడు మనకు అనుగ్రహించును గాక !

**- మరనాత.** **(సశేషం)**



# ఫిలిప్పీ పత్రిక

**శ్రీమతి దేవినేని నిర్మల, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

ప్రియ మరనాత మెసేంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామములో దేవుని దీవెనలు నిండుగా కలగాలనేదే మా ప్రార్థన. ఫిలిప్పీ సంఘ విశ్వాసులు నేర్చుకున్న సంగతులను గురించి పౌలు మాట్లాడుచున్నాడు. పౌలు ఏ సువార్తనైతే వారి మధ్యకు తీసుకొనివచ్చెనో దాని గురించి మరలా వ్యక్తిగతంగా తెలియజెప్పుచుండెను. ఫిలిప్పీయులు నేర్చుకున్న సంగతులను గురించి గ్రీకులో ఒక మాట వాడబడెను - "**Paralambanein**" "పారాలంబనైన్" అనగా నిర్దేశించబడిన భక్తి విధానమును అంగీకరించుట సంఘం అంగీకరించదగిన బోధను పౌలు వారికి అందించెననే ఆలోచన మనకు యిందులో గ్రాహ్యమగును.

గ్రీకు మాటలో నుండి గ్రహించదగిన రెండు ఆలోచనలు :

ఎ. సంఘమంతా స్వీకరించిన సత్యము మరియు సిద్ధాంతము

బి. బోధకుని యొక్క సూచనలతో వ్యక్తిగతముగా అంగీకరించిన బోధలో సంఘము నకు అనేకులను నడిపించి వెలిగించిన విధము.

అది బోధయైనా లేదా ఉపదేశమైనా క్రీస్తు సంఘము అంగీకరించదగిన సిద్ధాంతమై యుండాలి. ఆ తదుపరి ఆ సిద్ధాంతమును ఇతరులకు అందించాలి. మనము అందించే ఈ బోధ అనుభవముతో కూడినదై అనుకులను ఆలోచింపచేసే విధంగా మరియు ఎవరికైనా ఇట్టే అర్ధమయ్యేలా ఉండాలి. దీనినే మరింత స్పష్టంగా పౌలు వివరిస్తూ ఫిలిప్పీయులు తనగురించి ఏదైతే విన్నారో మరియు వేటినైతే వీక్షించారో వాటిని అనుకరించమని తెలియ జెప్పెను. సంఘమును బాధపరచే విషయమేమంటే కొంతమంది బోధకులు మరియు ఉపదేశకులు మాట్లాడుచున్నారేగానీ అనుకరించుటలో తప్పిపోవుచున్నారు. అయితే వ్యక్తిగత మాదిరికరమైన జీవితం అనునది మన జీవితముకు అద్దంపట్టేదైయుండాలి. ఒక ఉపదేశకుడు తప్పనిసరిగా క్రియలలోను, మాటలలోను సత్యమును కనపరచువాడై యుండాలి. ఈ భాగంలో చివరిగా పౌలు ఫిలిప్పీ స్నేహితులనుద్దేశించి నమ్మకస్తులుగా వీరు ఈ బోధలో కొనసాగినట్లయితే దేవుని యొక్క సమాధానము వారితో ఉండునని తెలియజెప్పెను. పౌలు దేవునికి ఇచ్చిన నామములు ఎంతో ఆసక్తికరముగా కనబడును. ఆ నామములు ఈ విధంగా చెప్పబడెను.

## 1. సమాధానకరమైన దేవుడు (God of Peace) (రోమా 16:20):

ఈ నామము అపోస్తలుడైన పౌలుకు చాలా యిష్టమైనది (1 కొరింథీ 14 : 33; 1 థెస్స 5: 23). ఒక యూదునికి సమాధానము అనునది వ్యతిరేకతను గాని, లేదా ఒక సమస్యను కప్పిపుచ్చేదిగా గానీ ఉండదు. ప్రతివిషయంలో ఈ సమాధానం మానవుని యొక్క

అత్యుత్తమ  స్థాయిని చూపిస్తుంది. దేవుని యొక్క స్నేహములో ఒక మానవుడు తాను ఏదైతే కావాలనుకుంటాడో దానిని పొందుకొనగలడు. దేవునితో సరియైన సంబంధాన్ని ఒక యూదుడు ఎప్పుడైతే కలిగియుంటాడో అతడు సమాధానాన్ని పొందుకుంటాడు. దేవుని యొక్క సమాధానం ద్వారా మాత్రమే అటు దేవునితో ఇటు మనుష్యులతో సమాధానం కలిగియుండగలం.

## 2. నిరీక్షణకర్తయైన దేవుడు (God of Hope) (రోమా 15 : 13) :

దేవునియందున్న  విశ్వాసం మాత్రమే ఒక వ్యక్తిని అన్ని పరిస్థితుల నుండి సంరక్షించును. అనుదిన జీవితంలో మానవుడు ఎదుర్కొనే ప్రతికూలతల నుండి ఈ నిరీక్షణే నిలబెట్టును. తన జీవితంలో ఎదురయ్యే అనేకమైన విపత్కర పరిస్థితుల నుండి కీర్తనాకారుడు - "నా ప్రాణమా నాలో నీవు ఎందుకో కృంగియున్నావు దేవునియందే నిరీక్షణయుంచుము" అని దేవునిని కీర్తించెను (కీర్తన 42 : 11; 43 : 5).

ఎఫ్.డబ్ల్యు ఫేబర్ అనే రచయిత ఈ విధంగా రచించెను - "దేవుడు దేవుడేయైనపుడు వాస్తవం వాస్తవమే. వాస్తవం ఎప్పుడూ విజయం పొందును. సందేహం దేవుని కార్యములను పొందుకొనుటకు అడ్డుబండగా ఉండును. ఆ సందేహమే పాపమునకు నడిపించును".

క్రైస్తవుని యొక్క నిరీక్షణ అనునది ఎవరూ తీసివేయలేనిది లేదా నాశనం చేయలేనిది. కారణం ఇది నిత్యుడైన దేవునిచే స్థాపించబడినది.

## 3. ప్రేమ మరియు శాంతికరమైన దేవుడు (God of Love and Peace) (2 కొరింథి 13 : 11) :

ఇది ఈ లేఖనభాగమునకు హృదయం వంటిది. దేవుని ప్రేమ అనునది మనలను ఎల్లవేళలా ముందుకు నడుపును. మన పాపములను సహించును. మన భారములను మోయును. మనలను ఎక్కడ బలహీనపరచదు. మానవ జీవితం అనే యుద్ధభూమిలో మనలను ఎంతగానో బలపరచును. ఈలోకంలో ఎవ్వరూ ఓడించలేని ప్రేమతో మనలను గెలుచుకున్న రక్షకుడు. ఈప్రేమకు ఎదురు తిరిగినటువంటి  వారిని తన వశం చేసుకొని, తనను అనుసరించునట్లు చేయుటయే ఈ ప్రేమ యొక్క ప్రత్యేకత. ఈ ప్రేమ ఎక్కడ ఉండునో అక్కడ మనకు శాంతి నిలిచియుంటుంది. విచారించ దగిన విషయమేమంటే, ఈ క్రీస్తు ప్రేమ ద్వారా కొనబడిన చాలా కుటుంబాలలో శాంతి అనునది ఎక్కడైనా మార్కెట్ స్థలాలలో దొరికే వస్తువులాంటిదిలాగా మారినదంటే ఆశ్చర్య మేమీ లేదనిపిస్తుంది. ఆవిధంగా మనలను మనము మోసం చేసుకొంటూ నేటికీ జీవిస్తుంటే ఆ జీవితం నుండి మనలను మనము విడిపించుకుని, క్రీస్తు ప్రేమతో మనలను మనము అలంకరించుకొని శాంతి, సమాధానములతో జీవించుదాం.

## 4. సహనము, ఆదరణతో ఆదరించు దేవుడు (God of Patience, of Comfort and of Consolation) (రోమా 15 : 5; 2 కొరింథి 1 : 3) :

సహనము, ఆదరణ అను రెండు గొప్ప పదములు కలవు. సహనము

అను పదమునకు గ్రీకులో "**Hupomone**" 'హుపోమోనే' అని వాడబడినది. అనగా అన్నింటిని సహించుకొని ఒక మూలన కూర్చుండుట కాదుగానీ, ధైర్యముగానిలబడి విజయం పొందుకొనుట అని అర్థం. మనకు సామర్థ్యమును, శక్తిని కలిగించి జీవితానికి గొప్పను, మహిమను తీసుకొని వచ్చేది దేవుడు. ఈ సహనశీలియైన దేవుడు ఆనందంలోను, బాధలోను, జయాపజయాలలోను, ఉత్సాహంలోను, నిరుత్సాహం, సామర్థ్యంలోను, బలహీనతలలోను, సామర్థ్యం లోను ఇతరులకు ఆశీర్వాదకరంగా చేసి మనలను తనకు సమీపంగా నడిపించును.

'ఆదరణ', 'ఆదరించుట' అను పదములకు ఒకే గ్రీకు పదం వాడబడినది. "**Paraklesis**" 'పారాక్లెసిస్' అనగా జాలికంటే కూడ మిన్నయైనది. ఎంతో ప్రోత్సాహకరమైనది. ఇది కేవలం ఒక వ్యక్తిచుట్టూ ఆదరణ పూర్వకంగా నేనున్నానని చెప్పటం మాత్రమే కాదుగానీ ఈ ప్రపంచాన్ని ఎదుర్కొనుటకు తగిన ధైర్యమును అనుగ్రహించేది. కేవలం కన్నీళ్ళు తుడిచేది మాత్రమే కాదుగానీ నిశ్చలమైనకళ్ళతో ప్రపంచాన్ని ధైర్యంగా చూచునట్లు చేసేది. ఈ గ్రీకుమాటయైన "**Paraklesis**" 'పారాక్లెసిస్' అనునది ఆదరణ మరియు బలముల యొక్క సమ్మేళనం. ఏ పరిస్థితినైనా దేవుడు మన మేలుకొరకు, ఆయన మహిమ కొరకు మాత్రమేకాక పరిస్థితులు తారుమారైనను బలమునునుగ్రహించి ముందుకు నడుపును. **- మరనాత.**



# జ్ఞానధార

1. ఉన్నతమైన ఆశయాలతో ఉద్యమించినవానికి
అపజయం కూడా దిగ్విజయమే అవుతుంది.

2. వేలాది వ్యర్థమైన మాటలు వినడంకాన్నా,
శాంతిని, కాంతిని ప్రసాదించే మంచి మాట ఒక్కటి చాలు.

3. ప్రపంచంలో ఎన్నో యుద్ధాలున్నా మనిషి తన మనస్సుతో చేసే యుద్ధం
అన్నింటిని మించిన మహాయుద్ధం.

4. భౌతికంగా చంపడానికి ఆయుధం కావాలి,
మానసికంగా చంపేందుకు ఒక్క పదునైన మాట చాలు.

5. మంచికోసం చేసే పోరాటంలో ఓడిపోయినా అది గెలుపే అవుతుంది.

6. పిరికివాళ్ళు ప్రేమను ప్రదర్శించలేరు, అది ధైర్యవంతుల లక్షణం.

7. ఆలోచించే మనిషికి ఆవేశముండదు,
ముందుచూపులేని మనిషికి ఆలోచనుండదు.

8. ఒక పనిలో విజయం సాధించాలంటే ముందు దాన్ని ప్రేమించాలి.

9. ఖచ్చితమైన లక్ష్యానికి కఠినమైన శ్రమ తోడైతే ఉన్నత స్థానం సాధ్యమే.

10. హృదయంలో నిజాయితీ ఉన్నప్పుడు ఆ అందం వ్యక్తిత్వంలో కనిపిస్తుంది.

11. అందనివాటిని కోరుకోవటం తప్పకాదు,
అందలేదని తెలిసినప్పుడు బాధపడటం తప్ప.

12. ఉన్నతంగా ఆలోచించేవారికి ఎన్నడూ ఒంటరితనం ఉండదు.
వారికి ఆలోచనలే మిత్రులు.

13. మనిషిలో ఆవేశం ముందడుగు వేసిన ప్రతిసారి
ఆలోచన రెండు అడుగులు వెనక్కి వేస్తుంది.

14. నీ సామర్థ్యం నీవు ఉపయోగించనంత వరకు అది నిరుపయోగమే.

15. రేపు అనేది సోమరులు పనిచేసే రోజు.

- డా॥ మనష్షే కొటారి, గుంటూరు

# మతం- కాదన్నదీకీ ముక్తిమార్గం

రఘ్నాని ఇమ్మానుయేలు, విజయవాడ

క్రైస్తవ్యం మతం కాదు
అసలైన క్రైస్తవ్యము మతంలో లేదు
అది సంపూర్ణ మానవత్వానికి ప్రతీక
దైవత్వము యొక్క సర్వ పరిపూర్ణత

క్రైస్తవ్యము - పరమ దేవుని చేరుకొనే ప్రారంభము
అవధులులేని క్రీస్తుప్రేమ ప్రభావము
నిరాధార భూలోకముకు పరలోక అనుసంధానము
ప్రతివారిని నిత్యమహిమకు చేర్చుటే దాని నైజము

మతం భ్రమలో నీ భవితను ఇంకా బాధపెట్టకు
మతం నేర్పిన బాహ్యాచారాలకు బందీవికాకు
నువ్వనుకుంటునట్టు.. క్రీస్తు మతంలో లేడు,
తానుండు స్థలముకు నిన్ను నడిపించు మార్గమై ఉన్నాడు

మతం వెలుపలికివచ్చి క్రీస్తులోనికి చూడు -
క్రీస్తులో నీకు సమస్తము దొరుకుతాయి
స్వేచ్ఛగా క్రీస్తుకు నీహృదయాన్ని సమర్పించు
క్రీస్తుతో కలసి జీవితాన్ని ఆనందించు

నీది కాని ఈ లోకంలో నువ్వున్నప్పుడే -
నీ శాశ్వతలోకాన్ని ఎంచుకోవాలి మరి ! నిర్ణయం గాలికొదిలేస్తే -
నువ్వు పోయే శాశ్వతలోకం- నరకమా, పరలోకమా ?
ముందే ఊహించుకో- లేదంటే తరువాత పడే నరకం ఊహించలేవు

జీవితం పరిమితం -
రక్షణ పొందుటకు ఇదే నీకు మంచి సమయం -
ఇప్పటికైనా మించిపోయింది లేదు
ఏమో, రేపు నీదికాదేమో !?

# వార్తల్లో కొన్ని ...

## పుస్తకాలు చదివితేనే 'పద సంపద' !

**వాషింగ్టన్, ఏప్రిల్ 7 :** పిల్లలు చిన్నతనంలోనే ఎక్కువ విషయాలు నేర్చుకుంటారు. ఆ వయసులో పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుంటే కొత్త కొత్త పదాలు నేర్చుకోవచ్చు. కానీ స్మార్ట్‌ఫోన్ యుగంలో పిల్లల మాట అటుంచితే.. పెద్దలే పుస్తకాలు చదవడం లేదు. ఈ కారణంగా చిన్నపిల్లలు లక్షల పదాలను తెలుసుకోలేకపోతున్నారని అమెరికాకు చెందిన ఓహియో యూనివర్సిటీ పరిశోధకులు జరిపిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. పిల్లలు రోజుకు ఒక పుస్తకం చదివిన వారు కొత్తగా 2.90 లక్షల కొత్త పదాలు నేర్చుకోగలరని తమ అధ్యయనంలో తేలిందని పరిశోధకులు తెలిపారు.

## భవిష్యత్తులో 'రోబో' సైనికులు!

**వాషింగ్టన్, ఏప్రిల్ 7 :** సరిహద్దుల్లో, యుద్ధరంగాల్లో చాలా చురుగ్గా వ్యవహరిస్తారు.. చాలా తెలివిగా శత్రు స్థావరాల్లోకి చొరబడి వారిని మట్టుబెడుతుంటారు. అచ్చం వారిలానే వివిధ టాస్క్‌లను చాకచక్యంగా పూర్తిచేసే రోబో సైనికులు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ మేరకు అమెరికాలోని ఆర్మీ రీసెర్చ్ లాబోరేటరీ (ఏఆర్ఎల్), యూనివర్సిటీ ఆఫ్ బఫెలో పరిశోధకులు కృత్రిమ మేధను అభివృద్ధి చేస్తున్నారు. ఈ మేరకు వివిధ టాస్క్‌ల్లో పాల్గొన్నప్పుడు సైనికులు ఎలా ఆలోచిస్తారు? దానిని వారు ఏవిధంగా పూర్తి చేస్తారు? ఆసమయంలో వారి మెదడు ఎలా ఆలోచిస్తుందనే అంశాలను విశ్లేషించి ఒక అల్గారిథమ్‌ను రూపొందిస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు.

## ఐవీఎఫ్‌కు కృత్రిమ మేధ బూస్ట్

**వాషింగ్టన్, ఏప్రిల్ 5 :** సంతాన లేమితో బాధపడే వారికి వరం.. ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫర్టిలైజేషన్). ఇది పిల్లలు కావాలనుకునేవారి కలలను సాకారంచేస్తుంది. అయితే, ఈ ఐవీఎఫ్ విధానంలో పిల్లలు పుట్టే సక్సెస్ రేటు చాలా తక్కువ. అగ్రరాజ్యమైనఅమెరికాలో సైతం సక్సెస్ రేటు కేవలం 45 శాతం ఉంది. అందుకే ఐవీఎఫ్‌కు బూస్ట్ ఇచ్చి.. సక్సెస్‌ను పెంచే కృత్రిమ మేధను అమెరికాలోని వెయిల్ కార్నెల్ మెడికల్ కాలేజీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఐవీఎఫ్ ద్వారా పలు అండాల్లోకి శుక్రకణాలను జొప్పించినప్పటినుంచి అవి ఫలదీకరణం చెందేవరకు, దాదాపు 110 గంటలపాటు వాటి కదలికలకు సంబంధించిన తీసిన 12వేల ఫొటోలను విశదీకరించి ఒక అల్గారిథమ్‌ను రూపొందించినట్లు పరిశోధకులు పేర్కొన్నారు.

## నడకతో వృద్ధాప్య సమస్యలు దూరం

**వాషింగ్టన్, ఏప్రిల్ 5 :** నడక ఆరోగ్యానికి మంచిది. ప్రతిరోజూ కొద్దిసేపు నడవడం వల్ల పలు రకాల అనారోగ్య సమస్యలు దరిచేరవు. అంతేకాకుండా వృద్ధాప్యంలో వచ్చే ఆర్థరైటిస్, కీళ్ళు, చీలమండ నొప్పులు, పటుత్వం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చే ముప్పుకూడా తగ్గుతుందని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. వయసు మీదపడటంతో కాళ్ళు, చేతులు సహకరించక చాలామంది తమ పనులను కూడా సొంతంగా చేసుకోలేరు. అదే రోజుకు 10 నిమిషాల చొప్పున, వారంలో గంట పాటు వేగంగా నడవడం ద్వారా ఈ ముప్పును 45% వరకు అధిగమించవచ్చని పరిశోధకులు తెలిపారు.

## గాయాలు మాన్పే సెన్సర్లు

**న్యూయార్క్, ఏప్రిల్ 2 :** గాయాలను త్వరగా మాన్పే సెన్సర్లను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ బింగాంటన్

పరిశోధకులు రూపొందించిన ఈ ఎలక్ట్రో మెకానికల్ సెన్సర్లు.. గాయమైన ప్రదేశాల్లోని చర్మాన్ని అనుకరించడంతో పాటు, వాటిపై లాక్టేట్, ఆక్సిజన్ స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయి. అలాగే, ఏ రసాయనాలకు శరీరం ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో విశ్లేషించి, అందుకు తగినట్లుగా రసాయనాలను అందిస్తుంది. తద్వారా త్వరగా గాయాలు మానేలా ఈ సెన్సర్లు దోహదపడుతాయని పరిశోధకులు పేర్కొన్నారు.

## పిల్లల్లో జీర్ణాశయ సమస్యలా ? మానసిక సమస్యేమో !

**వాషింగ్టన్, మార్చి 31 :** చిన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోవడం లేదా ఇతరత్రా సమస్యలతో బాధపడుతున్న పిల్లలు ఎక్కువగా కడుపునొప్పి, జీర్ణాశయ సమస్యలతో బాధపడతారట. అలాంటి వారికి భవిష్యత్తులో మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తాజాఅధ్యయనంలో తేలింది. పిల్లల్లో మానసిక ఎదుగుదల తగ్గిపోవడానికి ముందు.. అధికంగా కడుపునొప్పి, జీర్ణాశయ సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలంబియా శాస్త్రవేత్తలు తెలిపారు. మెదడుకు, పేగులకు మధ్య ఉన్న సంబంధంపై పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించారు.

## చేతులే రోగ కారకాలు

**టోరంటో, ఏప్రిల్ 6 :** సెల్‌ఫోన్ల నుంచి గుండు పిన్నుల వరకు.. ఫర్నిచర్ నుంచి భోజనం చేసే ప్లేట్ల వరకు.. కంప్యూటర్ కీ బోర్డుల నుంచి చదువుకునే పుస్తకాల వరకు.. ప్రతిదానిపై ఎన్నోరకాల హానికారక క్రిములు, రసాయనాలు ఉంటాయి. వీటిల్లో ఆర్గానోఫాస్ఫేట్ ఎస్టర్ (ఓపీఈ) ఒకటి. గాలి, నేల ద్వారా ఈ ఓపీఈ మన శరీరంలోకి చేరడం ద్వారా పలు అనారోగ్యాలు వస్తాయి. అయితే ఆయా వస్తువుల మీద ఉన్న హానికారక క్రిములు, శరీరంలోకి చేరడంలో మన చేతులే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## కీటో డైట్‌తో రక్తనాళాలకు హాని

**టోరంటో, ఏప్రిల్ 3 :** బరువు తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు చాలామంది ప్రత్యేకమైన ఆహారపు అలవాట్లను పాటిస్తున్నారు. వాటిల్లో ప్రొటీన్లు ఎక్కువగా ఉండి, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే కీటో డైట్‌ను ఎక్కువ మంది ఎంచుకుంటున్నారు. అయితే ఈ కీటో డైట్ ఆరోగ్యానికి అంత మంచిది కాదని, దీనివల్ల రక్తనాళాలు దెబ్బతింటాయని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. తమ పరిశోధనలో భాగంగా పలువురికి అధిక ప్రొటీన్లు, తక్కువ కార్బోహైడ్రేట్లు గల ఆహారం తీసుకునే ముందు, తర్వాత 75 గ్రాముల గ్లూకోజ్ కలిగిన పానీయాన్ని అందించారు. వారం తర్వాత వారిని పరిశీలించగా, ఆకస్మిక గ్లూకోజ్‌తో రక్తనాళాలు పేరుకుపోయినట్లు గుర్తించారు.

## చెడు డైట్.. పొగాకు కంటే ప్రమాదం

**వాషింగ్టన్, ఏప్రిల్ 6 :** తరచుగా మాంసం, శీతల పానీయాలు, అసంతృప్త కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటున్నారా? పళ్ళు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి పోషకాహారాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారా? అయితే జాగ్రత్త.. ప్రపంచవ్యాప్తంగా పొగాకు కారణంగా మరణించే వారికంటే కూడా.. చెడు ఆహారపు అలవాట్ల కారణంగానే ఎక్కువమంది మరణిస్తున్నారట. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవల్యూషన్ పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. చెడు డైట్ కారణంగా 2017లో ప్రపంచవ్యాప్తంగా 1.1 కోట్లమంది మరణించనట్లు పరిశోధకులు తెలిపారు. 195 దేశాలకు చెందిన వారి ఆహారపు అలవాట్ల డేటాను విశ్లేషించి ఈ విషయాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు.




-: ప్రతుల కొరకు :-

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-02-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

బుధవారం రాత్రి 8 - 8:30 గంటల వరకు
శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు
శనివారం రాత్రి 7 - 7:30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

సోమవారం మధ్యాహ్నం 1:30 - 2 వరకు
శుక్రవారం రాత్రి 9:30 - 10 గంటల వరకు